అచ్చంపేట మండలం సింగారం పంచాయతీ కార్యాలయంలో బ్యాంకు నోటీసులు వచ్చిన రైతులతో మాట్లాడుతున్న ఏఈవో రవితేజ

బ్యాంకర్ల నోటీసుపై సీఎంవో ఆరా?

- చర్చనీయాంశంగా 'నమస్తే' కథనం
- వ్యవసాయ శాఖ అధికారుల విచారణ

నమస్తే ఎఫెక్ట్

అచ్చంపేట/అచ్చంపేట రూరల్, అక్టోబర్ 11 : నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం సింగారం గ్రామానికి చెందిన రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలు మాఫీ కాలేదని, ఆ సొమ్మును తిరిగి చెల్లించాలని కొందరికి అచ్చంపేట ఏపీజీవీబీ నుంచి నోటీసులు అందాయి. ఇందుకు సంబంధించి 'మాఫీ సొమ్ము.. వాపస్ కట్టండి' శీర్షికన శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి సీఎంవో, వ్యవసాయ శాఖ కమిషనర్, కలెక్టరేట్ నుంచి అధికారులు ఆరా తీయడంతో వ్యవసాయ శాఖ అధికారులు, బ్యాంకు అధికారులు అప్రమత్తమయ్యారు. ఏఈవో రవితేజ సింగారం గ్రామానికి చేరుకొని నోటీసులు అందుకున్న రైతులను కలిశారు. వారితో మాట్లాడి సంబంధిత భూమి పాసు పుస్తకాలు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతాకు సంబంధించిన వివరాలు సేకరించారు. బ్యాంకుకు వెళ్లి రుణమాఫీ గురించి తెలుసుకొని రైతులకు తెలియజేస్తామని చెప్పారు. ఈ గ్రామంలో దాదాపు వెయ్యి మందికిపైగా రైతులు ఉండగా.. వారిలో 40 శాతం వరకు రూ.2 లక్షలలోపు రుణ మాఫీ జరిగిందని, 20 శాతం మంది రైతులకు రేషన్ కార్డులు లేకపోవడంతో వివరాలు తీసుకున్నామని ఏఈవో తెలిపారు. మిగిలిన వారికి రుణమాఫీ జరిగిందని ఆయన 'నమస్తే'కు వివరించారు.

రంగారెడ్డి జిల్లా చౌదరిగూడ పోలీస్ స్టేషన్ ఆవరణలో కొందుర్గు రైతులు

నాడు పట్టాలిచ్చి..నేడు కటకటాల్లోకి నెట్టి

- సీఎం పర్యటన నేపథ్యంలో రైతుల అరెస్ట్

షాద్‌నగర్, అక్టోబర్ 11: సీఎం రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల కేంద్రానికి చెందిన పలువురు రైతులను శుక్రవారం ఉదయం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి చౌదరిగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొందుర్గు మండల కేంద్రంలో ప్రభుత్వం కొత్తగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనానికి కేటాయించిన స్థలాన్ని.. గతంలో కొందుర్గు గ్రామానికి చెందిన రైతులు సున్నాల నర్సింహులు, సున్నాల చిన్న రాములు, సున్నాల రాంచంద్రయ్య, సున్నాల వెంకట్రాములుకు ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే పట్టాలు ఇచ్చింది. ఇప్పుడు తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే ప్రభుత్వం తమకు కేటాయించిన భూమిని చదును చేశారని బాధిత రైతులు వాపోయారు. ఈ విషయమై అధికారులను అడిగితే తమను అక్రమంగా అరెస్ట్ చేసి చౌదరిగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్టు చెప్పారు. రైతుల అక్రమ అరెస్టును స్థానికులు, బీఆర్ఎస్ నేతలు ఖండించారు. బాధిత రైతులకు సరైన న్యాయం చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

టీచర్లతో పెట్టుకోవద్దు!

- వాళ్లు పోలింగ్ బూతుల్లో చేయాల్సింది చేస్తారు
- ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యే ప్రభుత్వ లక్ష్యం
- పీవీ దార్శనికతతో రెసిడెన్షియల్ స్కూళ్లు
- 25 ఎకరాల్లో 125 కోట్లతో సమీకృత గురుకులాలు
- కొందుర్గులో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల శంకుస్థాపనలో సీఎం రేవంత్‌రెడ్డి

రంగారెడ్డి, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): ఎవరితోనైనా పెట్టుకోవచ్చు కానీ, టీచర్లతో పెట్టుకోవద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. టీచర్లతో పెట్టుకుంటే పోలింగ్ రోజు పోలింగ్ బూత్‌ల్లో చేయాల్సింది చేస్తారని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం కొందుర్గులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆయనతోపాటు శాసనమండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, రామ్మోహన్‌రెడ్డి, యాదయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచాన్ని ఏలే శక్తిసామర్థ్యాలు, తెలివితేటలు తెలంగాణ విద్యార్థులకు ఉన్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. విద్యా శాఖను తనవద్దనే ఉంచుకుని అధికారుల సలహాలతో విద్యాశాఖను ప్రక్షాళన చేస్తున్నామని వెల్లడించారు. తాజాగా 11 వేల మంది టీచర్లకు నియామక పత్రాలు అందజేసి తమ ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకున్నదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న బదిలీలు, పదోన్నతులను సాకారం చేసిందని వివరించారు. రాష్ట్రంలో 34 వేల మంది టీచర్లకు బదిలీలు, 21 వేల మంది టీచర్లకు ప్రమోషన్లు ఇచ్చి వారికి ప్రభుత్వం పట్ల విశ్వాసం కల్పించామని పేర్కొన్నారు.

కేసీఆర్ పాలనపై తిట్ల పురాణం

సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పటిలాగే కేసీఆర్ పాలనపై తిట్ల పురాణం అందుకున్నారు. తన 15 నిమిషాల ప్రసంగంలో 10 నిమిషాలు బీఆర్ఎస్ పాలనపై విమర్శలకే కేటాయించారు. గత ప్రభుత్వం పేదలకు విద్యనందించేందుకు, మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టలేదని, కానీ, తాము చేస్తుంటే తప్పుపడుతున్నారని విమర్శించారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అంటే తనకు గౌరవం ఉన్నదని, ఆయన ఏ పార్టీలో ఉన్నా తనకు అభ్యంతరం లేదని, అయితే యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లను ఎందుకు తప్పుపడుతున్నారని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు గొర్రెలు, బర్రెలు కాసుకుని బతకాలా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఐదువేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేసి గత ప్రభుత్వం పేదలకు విద్యను దూరం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం కేసీఆర్ రూ.10వేల కోట్లు కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు.

ఒక్క హామీ ఇవ్వలె

ముఖ్యమంత్రి రాకతో గంపెడు ఆశలు పెట్టుకున్న షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నియోజకవర్గంలోని పలు సమస్యలను ప్రస్తావించి సీఎం హామీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అయితే, సీఎం రేవంత్ రెడ్డి నుంచి ఒక్క సమస్య పరిష్కారానికీ, ఒక్క అభివృద్ధి పనికి కూడా హామీ లభించలేదు. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. సీఎం పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులను, ఎమ్మార్పీఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.

పీవీ దార్శనికతతోనే..

మాజీ ప్రధాని పీవీ నరసింహారావు దార్శనికతతో, ముందుచూపుతో 1972లోనే రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. పేదలకు విద్యను చేరువ చేసేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటుచేస్తున్నామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వేరుగా విద్యాలయాలు ఉంటే వారి మనసుల్లో విషం నిండుతుందని, అందుకే కుల, మతాలకు అతీతంగా కలిసి ఉండాలనే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటుచేస్తున్నామని చెప్పారు. 25 ఎకరాల్లో రూ.125 కోట్ల నుంచి రూ.150 కోట్లు వెచ్చించి సమీకృత గురుకులాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

తెలంగాణ సాంస్కృతిక జీవనంలో దసరాకు ప్రత్యేక స్థానం

- సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

హైదరాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): దసరా పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ సాంస్కృతిక జీవన విధానంలో దసరాకు ప్రత్యేక స్థానం ఉన్నదని పేర్కొన్నారు. విజయానికి చిహ్నంగా దసరా పండుగను విజయదశమి పేరుతో దేశవ్యాప్తంగా జరుపుకుంటారని గుర్తుచేశారు. దసరా రోజున కుటుంబంలోని సభ్యులందరూ ఒకేచోట చేరి సామూహికంగా సంబురాలు జరుపుకోవడం తెలంగాణ సబ్బండ వర్గాల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తుందని పేర్కొన్నారు. శమీపూజ చేసి జమ్మి ఆకును బంగారంగా భావించి అలయ్ బలయ్ చేసుకోవడం, పెద్దల ఆశీర్వాదం తీసుకోవడం, శుభసూచకంగా భావించే పాలపిట్టను దర్శించుకోవడం తెలంగాణ ప్రాంతానికి ప్రత్యేకమని గుర్తుచేశారు. తెలంగాణకు నిత్య విజయాలు కలిగాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలను ప్రసాదించాలని సీఎం దుర్గామాతను ప్రార్థించారు.

సీఎం సహాయనిధికి జింఖానా విరాళం

సీఎం సహాయనిధికి హైదరాబాద్ జింఖానా తరపున రూ.24,17,118 విరాళం అందజేశారు. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని జింఖానా చైర్మన్ రమేశ్‌బాబు, సెక్రెటరీ సత్యనారాయణ, బోర్డు సభ్యులు కలిసి ఈ మొత్తాన్ని అందజేశారు.

ప్రభుత్వ టీచర్లకు వారి స్కిల్స్‌పైనే నమ్మకం లేదు!

- అందుకే వాళ్ల పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు పంపుతున్నారేమో!
- వరంగల్‌లో మంత్రి కొండా సురేఖ అనుచిత వ్యాఖ్యలు
- ఇప్పటికే సినీనటులపై వివాదాస్పద వ్యాఖ్యలతో రచ్చరచ్చ

కరీమాబాద్, అక్టోబర్ 11 : మంత్రి కొండా సురేఖ మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే ఓ సినీ కుటుంబ వ్యక్తిగత విషయాల పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసి రచ్చకెక్కిన ఆమె.. తాజాగా ప్రభుత్వ ఉపాధ్యాయులపై నోరుపారేసుకున్నారు. 'ప్రభుత్వ విద్యాలయా ల్లో పనిచేసే టీచర్లకు వారి స్కిల్స్‌పై నమ్మకం లేకనే వారి పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు పంపుతున్నారు కావచ్చు.. ప్రభుత్వ టీచర్లు వారి పిల్లలను ఎందుకు ప్రభుత్వ బడుల్లో చేర్పించరో అర్థం కాదు.. ప్రభుత్వ విద్యా సంస్థ ల్లో పనిచేస్తున్న టీచర్లే వారి పిల్లల ను సర్కారు బడుల్లో చేర్పించక పోతే ఇతరులకు ఎలా నమ్మకం కలుగుతుంది?' అని వ్యాఖ్యానించారు. శుక్ర వారం వరంగల్ ఉర్సు రంగలీలా మైదా నంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షి యల్ పాఠశాల భవన శంకుస్థాపన సందర్భం గా మంత్రి సురేఖ ఈ వ్యాఖ్యలు చేశారు. తల్లిదండ్రులకు నమ్మకం కలిగేలా ప్రభుత్వ టీచర్లు వారి పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ బడుల్లో చదివిన వారు ఎంతో గొప్పస్థానాల్లో ఉన్నారని చెప్పారు. వారిని చూస్తే గురువులు గర్వంగా ఫీలవుతారని అన్నారు. కేంద్రీయ విద్యాలయాల్లో కోటాను సైతం కేంద్ర ప్రభుత్వం తగ్గించిందని గుర్తుచేశారు. గతంలో ఎంపీలకు అవకాశం ఇచ్చేదని, ప్రస్తుతం ఆ కోటాను వాటిని తీసేసిందని చెప్పారు. ప్రభుత్వం అన్ని వసతులతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణ పనులను చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్లకు కమిటీలు!

- పంచాయతీలు, మున్సిపల్ వార్డుల వారీగా ఏర్పాటు
- ఒక్కో కమిటీలో ఏడుగురికి చోటు
- జీవో జారీ చేసిన ప్రభుత్వం
- కాంగ్రెస్ నాయకులతో నింపేలా మార్గదర్శకాలు ఉన్నాయంటూ విమర్శలు

హైదరాబాద్, అక్టోబరు 11 (నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం జారీ చేసిన జీవో వివాదాస్పదంగా మారింది. గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డు స్థాయిల్లో ఏడుగురు సభ్యులతో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటుచేయాలని రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ పంచాయతీ స్థాయిలో ఏర్పాటయ్యే ఇందిరమ్మ కమిటీకి చైర్మన్‌గా ఆ గ్రామ సర్పంచ్ లేదా గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ వ్యవహరిస్తారు. కన్వీనర్‌గా గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉంటారు. మున్సిపల్ వార్డు కమిటీ చైర్మన్‌గా ఆ వార్డు కౌన్సిలర్ లేదా కార్పొరేటర్‌ను, కన్వీనర్‌గా వార్డు ఆఫీసర్‌ను నియమిస్తారు. వీరితోపాటు ఇద్దరు మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతోపాటు గ్రామాభివృద్ధిపై ఆసక్తి ఉన్న మరో ముగ్గురితో కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆ ముగ్గురిలో ఒకరు బీసీ, మరొకరు ఎస్సీ లేదా ఎస్టీ సామాజికవర్గాల నుంచి తప్పనిసరిగా ఉండాలని స్పష్టంచేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై లబ్ధిదారుల్లో అవగాహన కల్పించడం, చైతన్యం తీసుకొనిరావడం, ఇండ్ల నిర్మాణాలు చేపట్టడంలో లబ్ధిదారులకు అండగా నిలవడం, ఇందిరమ్మ ఇండ్లకు అర్హులైన లబ్ధిదారుల ఎంపిక తదితర అంశాలపై ఎంపీడీవో లేదా మున్సిపల్ కమిషనర్‌కు సమాచారం అందించడం తదితర బాధ్యతలను ఈ కమిటీలు నిర్వర్తించాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయా కమిటీల జాబితాను ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు జిల్లా కలెక్టర్లకు సమర్పించాలని, శనివారంలోగా కలెక్టర్లు కమిటీలను ఏర్పాటుచేయాలని ఆదేశించింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రులను సంప్రదించి కలెక్టర్లు ఆయా కమిటీలను ఖరారు చేయాలని స్పష్టంచేసింది. శనివారం దసరా పండుగ అని కూడా చూడకుండా పేర్లు ఇచ్చేందుకు ఒక్కరోజే గడువు విధించడంపై ఎంపీడీవోలు, గ్రామ కార్యదర్శులు, మున్సిపల్ కమిషనర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు.

కాంగ్రెస్ నేతలదే పెత్తనం

ఇందిరమ్మ కమిటీ పేరుతో గ్రామ పంచాయతీల్లో, మున్సిపల్ వార్డుల్లో కాంగ్రెస్ నాయకుల అనధికార పెత్తనం రుద్దే విధంగా ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసే విధంగా మార్గదర్శకాలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాలు, పట్టణాల్లో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఉంటారు. గ్రామంలో జరిగే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పర్యవేక్షించడం వారి బాధ్యత. కానీ, వారిని ఉత్సవ విగ్రహాలుగా మార్చే విధంగా ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో కూడా ఇదే విధంగా కమిటీలను ఏర్పాటుచేయడంతో అనేక విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇప్పుడు కూడా అదే తరహాలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి. అంతేకాకుండా, ఇందిరమ్మ కమిటీల ఎంపిక వ్యవహారంలో స్థానిక ఎమ్మెల్యేను పట్టించుకోకుండా ఇన్‌చార్జి మంత్రి ద్వారా మంజూరు చేసే అధికారాన్ని కల్పించారు. ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు ఉన్నచోట ఓడిపోయిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఇచ్చే జాబితాకే ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు స్పష్టమవుతున్నది.

ఉత్తర్వుల జారీలో అధికారుల నిర్లక్ష్యం

ఉత్తర్వుల జారీలో మరోసారి అధికారుల నిర్లక్ష్యం ప్రస్ఫుటమైంది. పట్టణ వార్డు కమిటీకి సంబంధించిన మార్గదర్శకాల్లో 'వార్డుకు సంబంధించిన ముగ్గురిని' అని కాకుండా 'గ్రామం నుంచి ముగ్గురిని' ఎంపిక చేయాలని సూచించడం గమనార్హం. ఉన్నతాధికారుల సరియైన పర్యవేక్షణ లోపించడం వల్లనే కింది స్థాయి అధికారులు, ఉద్యోగులు ఈ విధంగా తప్పుల తడకగా ఉత్తర్వుల కాపీలు సిద్ధం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అన్నా.. మా జీతం ఎప్పుడొస్తది?

- మంత్రుల దగ్గర పలువురు కార్పొరేషన్ చైర్మన్ల ఆరా
- పండుగ పూట ఊరికి వెళ్లే పరిస్థితి లేదని ఆవేదన

హైదరాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నియమించిన పలువురు కార్పొరేషన్ల చైర్మన్లకు ఇప్పటివరకు వేతనాలు అందలేదని సమాచారం. మూడునాలుగు నెలలు గడుస్తున్నా ఓవైపు వేతనాలు అందకపోవడం మరోవైపు చైర్మన్ అయినప్పటి నుంచి నిర్వహణ ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారట. ప్రభుత్వానికి ఆదాయాన్ని ఇచ్చే కార్పొరేషన్లకు నిధులు మంజూరయ్యాయని, ఆదాయం రానివాటిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో ఆయా కార్పొరేషన్ల చైర్మన్లు ఇటీవల కొందరు మంత్రులను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నట్టు సమాచారం. 'అన్నా.. మా జీతం ఎప్పుడొస్తుంది?. పండుగకు ఊరికి వెళ్లే పరిస్థితి కూడా లేదు. మాకేమో ఆదాయం లేదు. కానీ పండుగ ఇనాం అడిగేవాళ్లు ఎక్కువైపోయారు. ముఖం చాటేసుకొని తిరగాల్సి వస్తున్నది' అంటూ ఆవేదన వ్యక్తం చేశారట. పైగా మార్చిలో చైర్మన్లుగా ప్రకటించినప్పటి నుంచి ఇప్పటిదాకా ఖర్చులే తప్ప ఆదాయం లేదని చెప్పుకొచ్చారట. వెంటనే వేతనాలు మంజూరు చేయించాలని కోరినట్టు తెలిసింది.

60 రోజుల్లో కులగణన

మొదటిపేజీ తరువాయి...

ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు సీఎస్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

మిన్నంటిన ఎమ్మార్పీఎస్ ఆందోళనలు

ఎస్సీల్లో ఉపవర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఆగస్టు 1న తీర్పు వెలువరించింది. ఉపవర్గీకరణ చేసే అధికారం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందని స్పష్టంచేసింది. ఈ తీర్పుపై రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం హర్షం ప్రకటించింది. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాద తీర్మానం సైతం ప్రవేశపెట్టారు. దాంతో ఎస్సీ ఉపవర్గీకరణకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మాదిగలు ఆశించారు. నెలలు గడుస్తున్నా అడుగు కూడా ముందుకు వేయకపోవడంతో ఖంగుతిన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగలు ఆందోళనలు చేపట్టారు. మాదిగ పోరాట నాయకులు మంద కృష్ణ, వంగపల్లి శ్రీనివాస్ వేర్వేరుగా

రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వంపై ఒత్తిడి రావడంతో వర్గీకరణ అమలుకు క్యాబినెట్‌లో సైతం చర్చించారు. ఉత్తమ్ ఆధ్వర్యంలో క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటుచేశారు. కమిటీ భేటీలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సైతం వర్గీకరణ చేపట్టాల్సిందేనని ప్రభుత్వానికి విన్నవించారు. ఎక్కడికక్కడ తమను ప్రజలు వర్గీరణ అంశంపై నిలదీస్తున్నారని సీఎంకు తెలిపారు.

రోడ్డెక్కిన ఆదివాసీలు, గిరిజనులు

జనాభాకు అనుగుణంగా ఎస్టీ రిజర్వేషన్ పెంచాలని ఆదివాసీలు, గిరిజనులు చాలా నెలలుగా ఆందోళనలు చేస్తున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 16 (4) ప్రకారం.. రాష్ట్రంలో దళితులు, గిరిజనులు ఎంతశాతం ఉంటారో జనాభాలో అంతశాతం రిజర్వేషన్ పెంచుకోవచ్చు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆరు శాతం ఉన్న ఎస్టీ రిజర్వేషన్‌ను 10 శాతానికి పెంచారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ శాతం ఇంకా పెరుగుతుందని ఎస్టీలు డిమాండ్ చేస్తున్నారు. లంబాడీలు, గోండుల మధ్య తలెత్తిన రిజర్వేషన్ల కొట్లాటను కూడా సర్కారు పరిష్కరించాల్సి ఉన్నది.

ప్రభుత్వానికి బీసీల అల్టిమేటం

రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న తమకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో న్యాయమైన వాటా దక్కడం లేదని బీసీలు ఆందోళన చేపట్టారు. బీసీల రిజర్వేషన్‌ను తేల్చిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని బీసీ సంఘాల నేతలు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టారు. తక్షణమే బీసీ గణన చేపట్టాలని అల్టిమేటం జారీచేశారు. సుప్రీంకోర్టు సైతం ఇందుకు అనుగుణంగా తీర్పు చెప్పింది. ఈ నేపథ్యంలో బీసీ సంఘం నేత ఆర్ కృష్ణయ్య, జాజాల శ్రీనివాస్ ఇతర నేతలు కూడా రిజర్వేషన్లలో బీసీల వాటా తేల్చాలని డిమాండ్‌చేశారు. పెద్దఎత్తున రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి చర్చలు జరిపారు. ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించారు. బీసీల ఒత్తిడితో నిరంజన్ ఆధ్వర్యంలో బీసీ కమిషన్ వేసి చేతులు దులుపుకున్నది. దీనిపైనా బీసీలు నిరసనగళం పెంచుతూనే ఉన్నారు. మరోవైపు ముస్లింలు సైతం తమ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. తమ రిజర్వేషన్లకు కోతపెట్టి ఇతరవర్గాలకు కేటాయిస్తున్నట్టు వారు ఆరోపిస్తున్నారు. ఇంకోవైపు నిరుద్యోగులు కూడా ఆందోళన బాటపట్టారు. రిజర్వేషన్ల సంగతి తేల్చిన తర్వాతే నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలు ఒత్తిడి పెంచడంతో చివరికి రేవంత్‌రెడ్డి సర్కారు సమగ్ర సర్వేకు తలవంచక తప్పలేదు.

ఎస్సీ వర్గీకరణకు ఏకసభ్య కమిషన్

ఎస్సీ వర్గీకరణ కోసం ఏకసభ్య కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది. కమిషన్ చైర్మన్‌గా జస్టిస్ షమీమ్ అక్తర్‌ను నియమించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. 2023లో హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ షమీమ్ అక్తర్ రిటైర్ అయ్యారు. ఈ కమిషన్ ఎస్సీ క్యాటగిరీల్లో సబ్-క్యాటగిరీ జాతులపై సమగ్రంగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నది.

ఇంటింటికీ వెళ్లి సర్వే చేయండి

రాష్ట్రంలో ప్రతి ఇంటికీ వెళ్లి బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలవారీగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలపై సర్వే సమగ్రంగా చేపట్టాలని ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఫిబ్రవరి 4న మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాల ప్రకారం.. బడుగు, బలహీన వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఇతర బలహీనవర్గాల ప్రాతినిధ్యాన్ని పెంచడానికి సర్వే చేపట్టనున్నట్టు తెలిపారు. సర్వే నిర్వహణకు ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌ను నోడల్ డిపార్ట్‌మెంట్‌గా నియమించారు. ఈ సర్వేను 60 రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. ఇందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌ను ఆదేశించారు.

వేదిక ఏదైనా రాజకీయమే

- పార్టీ సభల్లా సీఎం సమావేశాలు
- ప్రతిపక్షాలపై దాడికే ప్రాధాన్యం
- ఆరోపణలు, తిట్లు, విమర్శలకే పరిమితం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరుతో అధికారుల్లో అసహనం

హైదరాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): సమయం లేదు. సందర్భం అసలే లేదు. ఉచితానుచితాల ప్రసక్తే లేదు. అధికారిక కార్యక్రమమా? పార్టీ కార్యక్రమమా అనేది పట్టదు. పిడుగుకి, బియ్యానికి ఒకటే మంత్రం అన్నట్టుగా ఉన్నది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహార శైలి. వేదిక ఏదయినా సరే ఒకటే భాష. ఒకే విధమైన ఊకదంపుడు ఉపన్యాసం. ప్రతిపక్షాలపై విమర్శలు, ఆరోపణలు, తిట్ల పురాణం తప్ప ముఖ్యమంత్రి ప్రసంగ పాఠంలో ఒక్కటంటే ఒక్క మంచి మాటలేకుండా పోతున్నది. సీఎం హోదాకు తలవంపులు తెచ్చేలా రేవంత్‌రెడ్డి ప్రసంగం కొనసాగడంపై విపక్షం, స్వపక్షం అనే కాదు సగటు తెలంగాణ పౌరుడు సైతం ఏహ్యభావాన్ని ప్రదర్శిస్తున్నాడు. పార్టీ కార్యక్రమాలు, సభలు, సమావేశాల్లో ప్రత్యర్థులపై రాజకీయ పార్టీలు విమర్శలు గుప్పించడం పరిపాటి. అది అక్కడి వరకే ఉంటుంది. కానీ ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లోనూ రాజకీయ ప్రసంగాలు చేస్తుండటమే ఇప్పుడు సర్వత్రా విమర్శలకు దారితీస్తున్నది. కంఠనరాలు చించుకుంటూ, వీరావేశంతో ఊగిపోతూ, ప్రతిపక్ష నేతలపై తిట్లు, విమర్శలు, ఆరోపణలు చేస్తుండటంపై ఉన్నతాధికారులు, ఉద్యోగులు చీదరించుకుంటున్నారు. సీఎం హోదాలో ఉన్నామనే సోయి మరచి ప్రవర్తించడమేంటని ఐఏఎస్‌లు, ఉన్నత